ఇది ఇండియా విక్టరీ

''పుష్ప-2' చిత్రాన్ని ఆదరిస్తూ నాపై ప్రేమ చూపిస్తున్న భారతీయులందరికీ కృతజ్ఞతలు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న సినీ ప్రేమికులందరూ భారతీయ సినిమాను ఇంతలా ఆదరిస్తున్నందుకు స్పెషల్ థాంక్స్. ఇది నా ఒక్కడి విక్టరీ కాదు. ఇండియా విక్టరీ' అన్నారు అల్లు అర్జున్. ఆయన కథానాయకుడిగా సుకుమార్ దర్శకత్వంలో రూపొందిన 'పుష్ప-2' వరల్డ్‌వైడ్‌గా భారీ వసూళ్లతో దూసుకుపోతున్నది. ఇప్పటికే 1000కోట్ల వసూళ్ల మైలు రాయిని దాటింది. ఈ నేపథ్యంలో గురువారం ఢిల్లీలో థాంక్యూ ఇండియా ప్రెస్‌మీట్‌ను నిర్వహించారు. అల్లు అర్జున్ మాట్లాడుతూ 'ఈ విజయానికి క్రెడిట్ అంతా సుకుమార్‌దే. ఆయన విజన్, కష్టానికి ఫలితమే ఈ గ్రాండ్ సక్సెస్. భవిష్యత్తులో ఈ సినిమా మరిన్ని వసూళ్లు సాధిస్తుంది. అయితే ఈ కలెక్షన్ నంబర్స్ అన్నీ టెంపరరీ. ఫ్యూచర్‌లో మరో సినిమా వీటిని దాటేయొచ్చు. కానీ ప్రేక్షకులు చూపిస్తున్న ప్రేమ మాత్రం శాశ్వతం. వారికి నేను ఎల్లప్పుడూ రుణపడి ఉంటాను' అన్నారు. అల్లు అర్జున్ కష్టానికి లభించిన ప్రతిఫలమే ఈ విజయమని చిత్ర నిర్మాతలు నవీన్ ఎర్నేని, రవిశంకర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హిందీ ఎగ్జిబిటర్స్ నిమిత్, సంజయ్, శశాంక్ రాజహెడ, యూపీ ఎగ్జిబిటర్ అశుతోష్ అగర్వాల్ తదితరులు పాల్గొన్నారు.

సంక్రాంతి వినోదానికి సిద్ధం

అగ్ర కథానాయకుడు వెంకటేష్ నటిస్తున్న తాజా చిత్రం 'సంక్రాంతికి వస్తున్నాం'. అనిల్ రావిపూడి దర్శకుడు. శ్రీవెంకటేశ్వర క్రియేషన్స్ పతాకంపై దిల్‌రాజు సమర్పణలో శిరీష్ నిర్మిస్తున్నారు. జనవరి 14న ప్రేక్షకుల ముందుకురానుంది. నేడు వెంకటేష్ జన్మదినం. ఈ సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు తెలియజేస్తూ మేకర్స్ కొత్త పోస్టర్‌ను విడుదల చేశారు. ఇందులో ఆయన స్టైలిష్‌గా కనిపిస్తున్నారు. నేడు ఈ సినిమా తాలూకు సెకండ్ సింగిల్ ప్రోమోని విడుదల చేయబోతున్నారు. ''సంక్రాంతికి వస్తున్నాం' ట్రయాంగిల్ క్రైమ్ కామెడీ కథ. ఇప్పటికే విడుదల చేసిన ప్రచార చిత్రాలు, పాటకు మంచి స్పందన లభిస్తున్నది. సంక్రాంతికి ఫ్యామిలీ అంతా కలిసి ఎంజాయ్ చేసేలా ఉంటుంది' అని చిత్రబృందం పేర్కొంది. మీనాక్షి చౌదరి, ఐశ్వర్య రాజేష్, ఉపేంద్ర లిమాయే, రాజేంద్రప్రసాద్, సాయికుమార్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: సమీర్ రెడ్డి, సంగీతం: భీమ్స్ సిసిరోలియో, రచన-దర్శకత్వం: అనిల్ రావిపూడి.

మూర్తీభవించిన మంచితనం తేజు

'పదేళ్ల అందమైన ప్రయాణం తేజుది. ఫైటర్‌లా పదేళ్ల ప్రయాణం పూర్తి చేశాడు. పాత్రకోసం తపించే నటుడు తేజు. మూర్తీభవించిన మంచి తనం తను. ఆంజనేయుడి సాక్షిగా చెబుతున్నా. యాక్సిడెంట్ తర్వాత తేజు ఇక్కడ నిలబడ్డాడంటే కారణం కేవలం మీ అందరి ఆశీస్సులే. ఆ టైమ్‌లో అందరం చాలా భయపడ్డాం. ఇక ఈ సినిమా విషయానికొస్తే.. తేజు ఊచకోత ఎలా ఉంటుందో ఈ సినిమాలో చూస్తారు. ఇది బిగ్గెస్ట్ బ్లాక్‌బస్టర్ కావాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నా. ఇంత భారీ బడ్జెట్‌తో సినిమా నిర్మించిన నిర్మాతలకు థ్యాంక్స్ చెబుతున్నా.' అని అగ్రహీరో రామ్‌చరణ్ అన్నారు. సాయిదుర్గతేజ్ కథానాయకుడిగా రోహిత్ కేపీ దర్శకత్వంలో ఓ చిత్రం తెరకెక్కుతున్న విషయం తెలిసిందే. ఈ సినిమాకు 'సంబరాల యేటిగట్టు'(SYG) అనే టైటిల్‌ని ఖరారు చేశారు. ఈ చిత్రానికి కె.నిరంజన్‌రెడ్డి, చైతన్యరెడ్డి నిర్మాతలు. ఐశ్వర్య లక్ష్మి కథానాయిక. గురువారం హైదరాబాద్‌లో జరిగిన ఈ చిత్రం కార్నేజ్ లాంచ్ ఈవెంట్‌కి అతిథిగా విచ్చేసిన రామ్‌చరణ్ సినిమా టైటిల్‌ను లాంచ్ చేసి, పై విధంగా స్పందించారు. సాయిదుర్గతేజ్ మాట్లాడుతూ 'హెల్మెట్ పెట్టుకోవడం వల్లే నేను ఈ రోజు బతికున్నాను. దయచేసి బైక్‌పై వెళ్లేవాళ్లు హెల్మెట్ పెట్టుకోండి. మీ అందరి ఆశీస్సులు నాపై ఎప్పుడూ ఇలాగే ఉండాలి.' అని పేర్కొన్నారు. ఇంకా అల్లు అరవింద్, వైష్ణవ్‌తేజ్, దర్శకులు వైవీఎస్ చౌదరి, దేవకట్టా, అనిల్ రావిపూడి, మారుతి, ప్రశాంత్‌వర్మ, తిరుమల కిశోర్, నిర్మాతలు టీజీ విశ్వప్రసాద్, ఎస్‌కేఎన్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

కల్యాణ వేళ..ఆనంద హేల

అగ్ర కథానాయిక కీర్తి సురేష్ వివాహబంధంలోకి అడుగుపెట్టింది. చిరకాల స్నేహితుడు ఆంటోనితో కలిసి పడడుగులు నడిచింది. గురువారం గోవాలోని ప్రముఖ రిసార్ట్‌లో వీరిద్దరి వివాహం ఘనంగా జరిగింది. ఈ వేడుకకు ఇరు కుటుంబాల పెద్దలు, సన్నిహితులు హాజరయ్యారు. తన పెళ్లి ఫొటోలను కీర్తి సురేష్ ఇన్‌స్టాగ్రామ్ ఖాతా ద్వారా షేర్ చేసింది. ప్రస్తుతం ఈ ఫొటోలు అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాయి. కొత్త జంటకు పలువురు సినీ ప్రముఖులు సోషల్‌మీడియా వేదికగా శుభాకాంక్షలు తెలియజేశారు.

కిరణ్ అబ్బవరం కొత్త చిత్రం

'క' సినిమాతో ఇటీవలే మంచి విజయాన్ని సొంతం చేసుకున్నాడు యువ హీరో కిరణ్ అబ్బవరం. దాదాపు 50కోట్లకుపైగా వసూళ్లతో ఈ సినిమా ఆయన కెరీర్‌కు పెద్ద బ్రేక్‌నిచ్చింది. ఈ సినిమా విజయోత్సాహంలో ఉన్న కిరణ్ అబ్బవరం ప్రస్తుతం తన తదుపరి చిత్రం కోసం సన్నద్ధమతున్నారు. 'కేఏ 10' వర్కింగ్ టైటిల్‌తో తెరకెక్కనున్న ఈ సినిమా కోసం కిరణ్ అబ్బవరం పాత్ర వినూత్న పంథాలో ఉంటుందని, ఆయన సరికొత్త మేకోవర్‌తో కనిపిస్తారని చెబుతున్నారు. ఈ సందర్భంగా బుధవారం ఆయన కొత్త లుక్‌తో కూడిన స్టిల్‌ను రిలీజ్ చేశారు. ఇందులో కిరణ్ అబ్బవరం స్టైలిష్‌గా కనిపిస్తున్నారు. కమర్షియల్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కనున్న ఈ సినిమా తాలూకు పూర్తి వివరాలను త్వరలో వెల్లడించనున్నారు.

15ఏండ్ల తర్వాత?

పూరీ జగన్నాథ్ ప్రస్తుతం ముంబైలో ఉన్నారట. అక్కడ కొత్త కథకోసం కసరత్తులు చేస్తున్నారని వినికిడి. అయితే.. ఆయన నెక్స్ట్ సినిమా ఏ హీరోతో అనేది మాత్రం ఇప్పటివరకూ క్లారిటీ లేదు. అయితే.. తాజాగా ఈ విషయంపై ఓ వార్త చక్కర్లు కొడుతున్నది. పూరీ జగన్నాథ్ నెక్స్ట్ సినిమా గోపీచంద్‌తో ఉంటుందట. పూరీ, గోపీచంద్ కలిసి 2010లో 'గోలీమార్' సినిమా చేశారు. అప్పట్లో ఆ సినిమా బాగానే ఆడింది. మళ్లీ ఇన్నాళ్లకు వీరిద్దరూ కలిసి పనిచేయనున్నారనేది ఈ వార్త సారాంశం. ఇది 'గోలీమార్'కు సీక్వెల్‌గా ఉంటుందని కూడా అంటున్నారు. 'గోలీమార్'లో హీరో క్యారెక్టరైజేషన్ బావుంటుంది. దానిచుట్టూ కొత్త కథను నడపొచ్చని పూరీ భావిస్తున్నట్టు ఫిల్మ్‌వర్గాల టాక్. ఈ చిత్రాన్ని బెల్లంకొండ సురేశ్ నిర్మించే అవకాశాలున్నాయి. వచ్చే ఏడాది మూడు సినిమాలు నిర్మించాలనేది ఆయన ప్లాన్. వాటిలో 'గోలీమార్ 2' ఒకటని సమాచారం.

అణచివేత నుంచి ఉద్భవించిన విప్లవం

విజయ్ సేతుపతి అతిథి పాత్రలో వెట్రిమారన్ దర్శకత్వంలో రూపొందిన 'విడుదల 1' తెలుగు, తమిళ భాషల్లో విడుదలై ప్రేక్షకుల ప్రశంసలందుకున్న విషయం తెలిసిందే. ఇప్పుడు ఈ చిత్రానికి సీక్వెల్ 'విడుదల 2' రానుంది. ఈ సెకండ్ పార్ట్‌లో విజయ్ సేతుపతే కథానాయకుడు కావడం గమనార్హం. శ్రీవేధాక్షర మూవీస్ పతాకంపై చింతపల్లి రామారావు ఈ చిత్రాన్ని తెలుగులో విడుదల చేస్తున్నారు. ఈ నెల 20న సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా సోమవారం హైదరాబాద్‌లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసిశారు. నిర్మాత చింతపల్లి రామారావు మాట్లాడుతూ 'అణచివేత నుంచి ఉద్భవించిన వీర విప్లగాథ ఇది. ఒక్క తమిళనాటే కాదు, తెలుగునేలపై కూడా సామాన్యులు ఎదుర్కొంటున్న సమస్యలు, సంఘటనల ఆధారంగా వెట్రిమారన్ ఈ సినిమా తీశారు. ఇందులో నక్సలైట్ నాయకుడు పెరుమాళ్‌గా విజయ్‌సేతుపతి విశ్వరూపం చూస్తారు. వెట్రిమారన్ దర్శకత్వ ప్రతిభ, ఇళయరాజా సంగీతం ప్రత్యేక ఆకర్షణ' అన్నారు.

ఇక ఊరుకునేది లేదు!

తెరపై అద్భుతమైన ప్రతిభాపాటవాలతో మెస్మరైజ్ చేస్తుంది అగ్ర కథానాయిక సాయిపల్లవి. వ్యక్తిగత జీవితంలో కూడా చక్కటి వినయ విధేయలతో సున్నిత మనస్కురాలిగా కనిపిస్తుంది. అలాంటి సాయిపల్లవి తమిళ మీడియాలో వచ్చిన ఓ వార్తపై సోషల్‌మీడియా వేదికగా భగ్గుమంది. మరోసారి ఇలాంటి వార్తలు పునరావృతమైతే చూస్తూ ఊరుకునేది లేదు అంటూ స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చేసింది. ఈ భామకు అంతలా కోపం తెప్పించిన సంఘటన వివరాల్లోకి వెళితే.. హిందీ చిత్రసీమలోకి అరంగేట్రం చేస్తూ సాయిపల్లవి 'రామాయణ' చిత్రంలో నటిస్తున్న విషయం తెలిసిందే. రణబీర్‌కపూర్ రాముడి పాత్రధారి. ఈ సినిమా కోసం సాయిపల్లవి మాంసాహారాన్ని మానేసి పూర్తిగా శాఖాహారిగా మారిపోయిందని ప్రముఖ తమిళ వెబ్‌సైట్‌లో ఓ స్టోరీ రాశారు. స్వతహాగా సాయిపల్లవి శాఖాహారి. తాను జీవితాంతం వెజిటేరియన్‌గానే ఉంటానని, ఓ జీవి చనిపోతుంటే అస్సలు చూడలేనని అనేక సందర్భాల్లో చెప్పింది. ఈ నేపథ్యంలో తమిళ వెబ్‌సైట్ రాసిన వార్తపై సాయిపల్లవి ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ మేరకు ఆమె సోషల్‌మీడియాలో ఓ పోస్ట్ చేసింది. 'చాలాసార్లు ఇలాంటి కట్టుకథలు, తప్పుడు కథనాలపై మౌనంగా ఉన్నా. కానీ ఇవి ఆగేలా లేవు. ముఖ్యంగా నా సినిమాలకు సంబంధించి ప్రత్యేక సందర్భాలు, సంతోషకరమైన క్షణాల్లో ఇలాంటి తప్పుడు వార్తల్ని ప్రచారం చేస్తున్నారు. మరోసారి ఇలాంటి గాసిప్స్, అవాస్తవాలు రాస్తే చూస్తూ ఊరుకోను. తప్పకుండా లీగల్ యాక్షన్ తీసుకుంటా' అని సాయిపల్లవి తన పోస్ట్‌లో హెచ్చరించింది.

సుందరవల్లి రాజసం

ఆ మధ్య తెలుగు సినిమాలకు కాస్త బ్రేక్‌నిచ్చిన కన్నడ భామ నభా నటేష్ ప్రస్తుతం బిజీగా మారింది. ఇటీవలే 'డార్లింగ్' సినిమాతో ప్రేక్షకుల్ని పలకరించింది. ఆమె నిఖిల్ సరసన కథానాయికగా నటిస్తున్న తాజా చిత్రం 'స్వయంభూ'. భరత్ కృష్ణమాచారి దర్శకుడు. భువన్, శ్రీకర్ నిర్మాతలు. పీరియాడిక్ వార్ బ్యాక్‌డ్రాప్‌లో తెరకెక్కిస్తున్న ఈ సినిమాలో హీరో నిఖిల్ వారియర్ పాత్రలో కనిపించనున్నాడు. ఇదిలా వుండగా గురువారం కథానాయిక నభా నటేష్ జన్మదినం. ఈ సందర్భంగా సుందరవల్లి అనే పాత్రలో నభా నటేష్ కొత్త పోస్టర్‌ను విడుదల చేశారు. కథాగమనంలో సుందరవల్లి పాత్రకు చాలా ప్రాముఖ్యత ఉంటుందని, రాజసం కలబోసిన మహారాణిగా ఆకట్టుకుంటుందని చిత్ర బృందం పేర్కొంది. ప్రస్తుతం 'స్వయంభూ' చిత్రీకరణ జరుపుకుంటున్నది. ఈ చిత్రానికి సంగీతం: రవి బస్రూర్, రచన-దర్శకత్వం: భరత్ కృష్ణమాచారి.

సర్‌ప్రైజ్ చేసే ఫియర్

వేదిక లీడ్‌రోల్ చేసిన సస్పెన్స్ థ్రిల్లర్ 'ఫియర్'. డా.హరిత గోగినేని దర్శకురాలిగా పరిచయం అవుతున్నారు. డా.వంకి పెంచలయ్య, ఏఆర్ అభి నిర్మాతలు. ఈ నెల 14న సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో ప్రీ రిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. స్క్రిప్ట్‌ని నమ్మి చేసిన సినిమా ఇదని, నాలుగు భాషల్లో సినిమాను విడుదల చేస్తున్నామని, గురువారం నుంచి ప్రీమియర్స్ వేస్తున్నామని నిర్మాత అభి తెలిపారు. 'ఫియర్ స్క్రీన్‌ప్లే ఓరియెంటెడ్ మూవీ. సినిమా అంతా ఒక కాన్సెప్ట్‌తో వెళ్తుంది. విడుదలకు ముందే 70 ఇంటర్నేషనల్ అవార్డ్స్ వచ్చాయి. ఈ సినిమాలో వేదిక డ్యుయెల్ రోల్ చేశారు. వేదిక సహకారం వల్లే సినిమా ఇంత బాగా వచ్చింది. అనూప్ మ్యూజిక్, ఆంధ్రా విజువల్స్ సినిమాకు హైలైట్స్‌గా నిలుస్తాయి. ఫియర్ సినిమాతో ఎన్నో సర్‌ప్రైజ్ ఎలిమెంట్స్ ఉన్నాయి. వాటిని తెరపై చూస్తేనే బావుంటుంది.' అని డైరెక్టర్ హరిత గోగినేని అన్నారు.

రొమాంటిక్ థ్రిల్లర్ వారధి

అనిల్ అర్కా, నిహారికా చౌదరి జంటగా రూపొందిన యూత్‌ఫుల్ లవ్ స్టోరీ 'వారధి'. శ్రీకృష్ణ దర్శకుడు. పెయ్యాల భారతి, ఎం.డి.యూనస్ నిర్మాతలు. సెన్సార్ కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ చిత్రం త్వరలో విడుదల కానుంది. 'ఇది యూత్‌కి నచ్చే లవ్ అండ్ రొమాంటిక్ థ్రిల్లర్. ప్రేమ, భావోద్వేగాలు, సస్పెన్స్ అంశాల కలబోత ఈ సినిమా. నటీనటుల అభినయం, సాంకేతిక నిపుణుల కృషి ఈ చిత్రానికి ప్రధాన బలాలు. 'వారధి' ఈ తరం ప్రేక్షకులకు స్పెషల్ ట్రీట్‌గా నిలుస్తుంది.' అని దర్శకుడు చెప్పారు. ప్రశాంత్ మడుగుల, రిధి కీలక పాత్రల్లో నటించిన ఈ చిత్రానికి రచన: నాగేంద్ర పలగాని, కెమెరా: శక్తి.జె.కె, సంగీతం: షారుఖ్ షేక్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: బి.ఎన్.చందు.

ఇడియట్స్ ఆఫ్ ఇస్తాంబుల్

బాలీవుడ్‌లో ప్రేమకథా చిత్రాలకు పెట్టింది పేరు దర్శకుడు ఇంతియాజ్ అలీ. తాజాగా ఆయన మరో ప్రేమకథా చిత్రానికి సిద్ధమవుతున్నారు. 'ఇడియట్స్ ఆఫ్ ఇస్తాంబుల్' పేరుతో తెరకెక్కించబోతున్న ఈ సినిమాలో మలయాళ అగ్ర నటుడు ఫహాద్ ఫాజిల్, 'యానిమల్' ఫేమ్ త్రిప్తి దిమ్రి జంటగా నటించబోతున్నారు. ఫహాద్ ఫాజిల్ ఈ సినిమా ద్వారా బాలీవుడ్‌లో ఎంట్రీ ఇవ్వబోతున్నారు. హాస్యప్రధానంగా సాగే ప్రేమకథగా దర్శకుడు ఇంతియాజ్ అలీ ఈ సినిమాను తెరకెక్కించబోతున్నాడని, టర్కీలోని ఇస్తాంబుల్‌కు నాయకానాయికల ప్రయాణం, ఈ నేపథ్యంలో వారిమధ్య చోటుచేసుకునే సంఘటనలే చిత్ర ఇతివృత్తమని చెబుతున్నారు. ప్రస్తుతం ప్రీప్రొడక్షన్ దశలో ఉన్న ఈ సినిమా ఫిబ్రవరిలో సెట్స్‌మీదకు వెళ్లనున్నట్లు తెలిసింది. తక్కువ రోజుల్లోనే షూటింగ్‌ను పూర్తి చేసి 2025 ద్వితీయార్థంలో విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఫహాద్ ఫాజిల్ ఇటీవలే విడుదలైన 'పుష్ప-2' చిత్రంలో భన్వర్ సింగ్ షెకావత్ పాత్రలో కనిపించిన విషయం తెలిసిందే. ప్రతినాయక ఛాయలతో సాగిన ఈ పాత్రకు ప్రేక్షకుల్లో మంచి గుర్తింపు దక్కింది.